## హుండీ లెక్కింపు

నాగలింగేశ్వరస్వామి ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, డిసెంబర్ 5: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలోని శ్రీ లలితా నాగలింగేశ్వర స్వామి దేవాలయ హుండీని గురువారం భక్తుల సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ. 1, 26, 205 లక్షల నగదు ఆలయానికి సమకూరినట్లు ఆలయ అడహక్ కమిటీ సభ్యులు తెలిపారు. సదరు నగదును ఆలయ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన స్వయంభూ శివాలయానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటీ సభ్యులు తుల సమ్మ, మేకల వెంకట్‌రెడ్డి, సహారాస్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ కోశాధికారి శేకరయ్య, కాలనీవాసులు సైంటిస్ట్ ప్రకాశ్, గంగదాసు కృష్ణారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

### ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో..

కర్మన్‌ఘాట్ హనుమాన్
ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చంపాపేట, డిసెంబర్ 5: చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవస్థానం హుండీలను గురువారం ఆలయ కార్యనిర్వాహణాధికారి లావణ్య ఆధ్వర్యంలో, దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్ పర్యవేక్షణలో లెక్కించారు. స్వాములోరికి రూ.57,63,708 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. వీటితో పాటు 183 యూఎస్ డాలర్లు, 5 యూరోస్, 200 ఒమన్ రియల్స్, 1బహ్రైన్ దినార్, 235 అరబ్ దర్హమ్స్ 10 ఆస్ట్రేలియ డాలర్లు, 75 న్యూజిలాండ్ డాలర్లు, 10 గ్రేట్ బ్రిటన్ పౌండ్స్, 5 సింగపూర్ డాలర్లు వచ్చినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంబయ్య, సంతోష్‌కుమార్, శ్రవణ్‌కుమార్, సిబ్బంది వెంకటయ్య, రమాదేవి, వేణుగోపాల్, స్వాతి, మాజీ ధర్మకర్తలు చీర తిరుమలేశ్, బబ్బూరి ఆనంద్ గౌడ్, మేకల యాదగిరి, భ్రమరాంబిక, సేవా సమితి వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్విమ్మింగ్ పూల్

జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 5: హస్తినాపురం డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.5కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపట్టామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం కాలనీలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 కోట్లతో మూడు వందల గజాల స్థలంలో స్విమ్మింగ్ పూల్, ఇండోర్ జిమ్, షటిల్ కోర్టు, ఆఫీస్ నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. రూ.8 కోట్ల అంచనా వ్యయమవుతుందని, ప్రస్తుతానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులు నత్తనడకన నడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్నన్ని స్విమ్మింగ్ పూల్స్ మరెక్కడా లేవని గుర్తు చేశారు. మాజీ కార్పొరేటర్ పద్మనాయక్, బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని బాలుడు..

మతిస్థిమితంలేని బాలుడిని
తీసుకెళ్తున్న పోలీసులు

బడంగ్‌పేట్, డిసెంబర్ 5 : రాచకొండ కమిషనరేట్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెల్లగూడ స్వాగత్ గ్రాండ్ వద్ద గురువారం మతిస్థిమితం సరిగా లేని మాటలు రాని బాలుడు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న మీర్‌పేట్ పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడు వయసు సుమారు 8 సంవత్సరాలు ఉంటుందని, బాలుడికి మతిస్థిమితం సరిగాలేదని, తల్లిదండ్రుల వివరాలు తెలుపలేకపోతున్నాడని ఈ బాలుడి ఆచూకీ తెలిసిన వారు మీర్‌పేట్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పారిశుధ్య కార్మికుడికి చెత్త రిక్షాను అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్

వనస్థలిపురం, డిసెంబర్ 5: పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. గురువారం వార్డు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు చెత్త రిక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరు డబ్బాల్లో నిల్వ చేసి ఆటో, రిక్షాల్లో వేయాలని సూచించారు. ఖాళీ స్థలాలు, రహదారుల పక్కన చెత్తను వేయవద్దన్నారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో స్వచ్ఛ డివిజన్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. జవాన్ శంకర్, ఎస్ ఎఫ్ఏలు , నాయకులు రాజుగౌడ్, చందు, గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం రాక లబ్ధిదారుల ఇక్కట్లు

చంపాపేట, డిసెంబర్ 5: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమో, లేక అధికారుల అలసత్వం మూలంగానో తెలియదు గానీ, ప్రతి మొదటి తేదీ నుంచి పౌరసరఫరాల విభాగం నుంచి సరఫరా కావాల్సిన రేషన్ బియ్యం నేటికి దుకాణాలకు సరఫరా చేయక పోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చంపాపేట, డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో ఉండే రేషన్ షాపులకు, ఇదే విధంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మరికొన్ని షాపులకు గురువారం నాటికి కూడా రేషన్ గోదాముల నుంచి సంబంధిత అధికారులు రేషన్ సరఫరా చేయలేదు. దీంతో లబ్ధిదారులు నిత్యం రేషన్ దుకాణాల వద్ద రేషన్ కోసం పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకే రేషన్ బియ్యం విక్రయాలు జరుగుతాయని ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. కానీ, సరైన సమయంలో షాపులకు సర్కులు సరఫరా చేయాలనే చిత్తశుద్ధి లేక పోవడం దుర్మార్గమని ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఎస్‌వోను వివరణ కోరగా అనివార్య కారణాలతో రేషన్ బియ్యం సరఫరాలో కొంత ఇబ్బందులు ఏర్పడి కొంత ఆలస్యం కావడం జరిగింది. రెండు రోజుల్లో అన్ని రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారని, పలు రైషన్ దుకాణాల నిర్వాహకులు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా అత్యోదయ అన్నయోజన కార్డుల లబ్ధిదారులకు సరఫరా చేసే చక్కెర గత రెండు మాసాలుగా సరఫరా కావడం లేదని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు.

## పైప్‌లైన్ పనులు ప్రారంభం

పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న
కార్పొరేటర్ జంగం శ్వేత

మలక్‌పేట, డిసెంబర్ 5: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మెరుగైన తాగునీటి వసతులు కల్పించనున్నట్లు కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. గురువారం సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో నిర్మించనున్న100ఎంఎం డయా వాటర్ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో లో ప్రెషర్ సమస్యలు తలెత్తకుండా ప్రజలందరికి 100ఎంఎం డయా లైన్‌ను నిర్మించటం జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మెరుగైన నీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. మున్ముందు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా పెద్ద పైపు లైన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యుఎస్ ఎస్‌బీ డీజీఎం సన్యాసిరావు, మేనేజర్ రమ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నిర్బంధ పాలన

కందుకూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్

కందుకూరు, డిసెంబర్ 5 : రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మండల మహిళా విభాగం అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, మండల ఉపాధ్యక్షుడు ఆనేగౌని దామోదర్‌గౌడ్‌లతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తున్నట్లు తెలుసుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి వెళితే అక్రమంగా ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రులను అరెస్టు చేయడం సమంజసం కాదని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న హరీశ్ రావుపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష గట్టి అక్రమ కేసులను బనాయిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టి జైలుకు పంపిన ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. ప్రజాపాలన అంటే ఇదేనా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే వారిపై మోపిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అంటే అక్రమ కేసులా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పాత్ర పోషించడం తప్ప అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మాజీ డైరెక్టరు దేవీలాల్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు , గుయ్యని సామయ్య, మాజీ సర్పంచ్ గణేశ్ ముదిరాజ్, దేవేందర్ పాల్గొన్నారు.

## వృద్ధురాలు అదృశ్యం

ఈశ్వరమ్మ(ఫైల్)

మలక్‌పేట, డిసెంబర్ 5: టీ త్రాగడానికని ఇంటినుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డిఅన్నారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డిఅన్నారం పోచమ్మ బస్తీకి చెందిన ఈశ్వరమ్మ ఈ నెల 3న 10.30 గంటలకు టీ త్రాగడానికని ఇంటినుంచి బయటి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అన్నిచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవటంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈశ్వరమ్మ అప్పుడప్పుడు చాదర్‌ఘాట్‌లోని తెలిసిన వారి వద్దకు వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత తిరిగి వచ్చేదని, కాని ఈసారి రాలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లు

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మన్సూరాబాద్, డిసెంబర్ 5: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు జీవనోపాధి పోయిందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాములు తెలిపారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఈ నెల 7న నిర్వహిస్తున్న ఆటో, క్యాబ్ రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను గురువారం ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా ఆటో డ్రైవర్లు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని.. ఆటోలపై తీసుకున్న ఫైనాన్స్ కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆటో, క్యాబ్‌లను నడుపుకుని జీవనం కొనసాగిస్తున్న డ్రైవర్లకు ఆదాయం వచ్చే మార్గాలను ప్రభుత్వం చూపాలన్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని కోరారు. ఓలా, ఉబర్, ర్యాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూవీలర్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ చార్జీలను పెంచి, థర్డ్ పార్టీ ఇన్సురెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. యాక్సిడెంట్ బీమాను రూ. 10 లక్షలకు పెంచి సాధారణ మరణాలకు సైతం వర్తింపజేయాలని కోరారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల హక్కుల సాధనకు ఈ నెల 7న నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, ఇమాన్యుయల్, కృష్ణమూర్తి, గోపి, రమేశ్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బందిని వేధించడం సరికాదు

నిరసన వ్యక్తం చేస్తున్న జీహెచ్ఎంసీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు

ఎల్బీనగర్, డిసెంబర్ 5: ఉద్యోగులు, సిబ్బందిని వేధించడం, ఒత్తిడి పెంచడం సరికాదని జీహెచ్ఎంసీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంద రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కకర్ల దేవేందర్, బీఎంఎస్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు అన్నారు. ఎల్బీనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సేవా నేస్లావత్ ఉద్యోగులు, సిబ్బందిని పని ఒత్తిడితో ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ జీహెచ్ఎంసీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ సమగ్ర సర్వే చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని తీవ్ర ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. ఈ నెల 3వ తేదీన మంగళవారం ఎల్బీనగర్ సర్కిల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజు పని ఒత్తిడితో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎల్బీనగర్ సాగర్ రోడ్డులో కల్లు తిరిగి కింద పడిపోయి తలకు గాయాలై బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయ్యిందని, ప్రస్తుతం శ్రీనివాస్‌రాజు మలక్‌పేట్ యశోద ఆసుపత్రిలో సర్జరీ అనంతరం సీరియస్ కండిషన్‌లో ఉన్నారని తెలిపారు. అధికారులు ఉద్యోగులను, సిబ్బందిని సమయానుకూలంగా పని చేయించాలని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌కు తాము వినతిపత్రం సమర్పించనున్నామన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం సికింద్రాబాద్ జోనల్ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ అధ్యక్షుడు ఆనంద్, ఎల్బీనగర్ జోనల్ అధ్యక్షుడు యాదగిరి, జీహెచ్ఎంసీ కోశాధికారి జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అవగాహన కార్యక్రమంలో బేగంపేట టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు

అంబర్‌పేట, డిసెంబర్ 5 : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ సీపీ సి.వి.ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం డీడీ కాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ' రోడ్డు ప్రమాదాలు.. నివారణ' పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏసీపీ మాట్లాడుతూ.. ఎక్కువగా యువత ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలు శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వెనుక వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ వి.రాచందర్ మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే ఆరు నెలల వరకు జైలుశిక్ష లేదా రూ.1000 జరిమానా.. రెండూ విధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ రచన, పునీత్, సిబ్బంది, ట్రాఫిక్ ఎస్సై వీర మల్లయ్య, అయాన్, కృష్ణ, హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్ వైజర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు టీయూటీఎఫ్ మద్దతు

కీసర, డిసెంబర్ 5: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం మద్దతు ప్రకటిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి లచ్చుమల్ల వెంకన్నలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు ఇరవై వేలమంది వివిధ హోదాల్లో తక్కువ జీతాలతో ఎన్నో ఏండ్లుగా ఉద్యోగాలను వెళ్లదీస్తున్నారన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఈనెల 6,7 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షలకు 9 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వారికి కనీస వేతనంతో ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అక్రమ కట్టడాలను అరికట్టాలని కాలనీవాసుల ధర్నా

ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ఉప్పల్, నవంబర్ 5 : కాలనీల్లో అక్రమ కట్టడాలను అరికట్టడంలో జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ ఉప్పల్‌లోని పలు కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, కాలనీవాసులు గురువారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ, అక్రమ నిర్మాణాదారులపై చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఉప్పల్ గణేష్‌నగర్‌లో నిర్మిస్తున్న నిర్మాణంపై కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిర్మాణం చేస్తున్నారని, కానీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ల అధ్యక్షులు శ్రీధర్‌గుప్తా పాల్గొన్నారు.

## రైలెక్కుతూ.. వాచ్‌మెన్ మృతి

కాచిగూడ, డిసెంబర్ 5 : ఎంఎంటీఎస్ రైలెక్కుతూ.. ప్రమాదవశాత్తు వాచ్‌మెన్ మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన నారాయణ కుమారుడు సాయిబాబా (64) సెయింట్ మేరీ స్కూల్లో వాచ్‌మెన్. బుధవారం రాత్రి ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం – 1లో ఫలక్‌నుమా – లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసు లు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్లాట్‌ఫారంపై వ్యక్తి ..

ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) గురువారం సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం – 3 లో అనారోగ్యంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘ టనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

## ధ్యానాంజనేయ స్వామికి పూజలు

చంపాపేట, డిసెంబర్ 5: బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు హయత్‌నగర్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన కనకాల శ్యామ్ కురుమ గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ గురుస్వామి,శివరాజ్‌రెడ్డి, దేవానాయక్, శివారెడ్డి, జ్ఞానేశ్వర్, మనితేజ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఉప్పల్, డిసెంబర్ 5: నావికాదళ దినోత్సవం సందర్భంగా నాచారంలో మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. రెండు రోజులపాటు ఈ పోటీల్లో నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్ లోకే, వీరేంద్ర, శ్యామ్, కృష్ణకిశోర్‌రెడ్డి, మధు, విజయ్‌కుమార్, సంతోష్, సాయిచందర్, శ్రీధర్, సురేందర్, శివ, స్నేహిత్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, రాజు, నివాస్ పాల్గొన్నారు.

## శబరిమల దర్శనం

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. బుధవారం నగరం నుంచి ఇరుముడితో బయలుదేరిన ఎమ్మెల్యే గురువారం శబరి కొండకు చేరుకొని ఉదయం అయ్యప్పను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట శేఖర్‌రెడ్డి గురుస్వామి, దిలీప్ స్వామి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

- అంబర్‌పేట

## మురుగుకు అడ్డుకట్ట వేయండి

బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లోకి వస్తున్న మొయిని చెరువు మురుగుకు అడ్డుకట్ట వేయాలని కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి ఓయూ అధికారులకు చెప్పారు. చెరువు నుంచి వస్తున్న మురుగు మల్లికార్జుననగర్ బస్తీలో చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోగా గురువారం ఉస్మానియా యూనివర్సిటీ అధికారులను పిలిపించి, సమస్యను వెంటనే పరిష్కరించాని చెప్పారు.

- అంబర్‌పేట

జైలు అంటే ఖైదీలకు శిక్ష వేయడమే కాదు, ఖైదీల్లో పరివర్తన తెచ్చి వారిలో నైపుణ్యాలు పెంపొందిస్తూ సత్ప్రవర్తన గల ఖైదీలుగా తీర్చిదిద్దేలా జైళ్లశాఖ పనిచేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చంచల్‌గూడ సెంట్రల్ జైల్లోని సికా పరేడ్ గ్రౌండ్‌లో దీక్షాంత్ పరేడ్‌లో శిక్షణ పొందిన జ